క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసిన శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా మూలవర్లకు అభిషేకం, తిరుప్పావడ సేవలను వేదపండితుల శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.గిరికృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

కలెక్టర్, మంత్రులను కలిసిన ఎస్పీ



కలెక్టర్ ఆనంద్‌కు మొక్క అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.కృష్ణకాంత్ సోమవారం కలెక్టర్ ఒ.ఆనంద్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో, మంత్రులు ఆనం, నారాయణలను వారి క్యాంపు కార్యాలయాల్లో కలిసి మొక్కలు అందజేశారు.

మంత్రులను కలిసిన వేమిరెడ్డి దంపతులు



రాష్ట్ర హోం మంత్రి అనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవిలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రుల చాంబర్లలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. జిల్లాకు సంబంధించి పలు సమస్యలను మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి తీసుకెళ్లారు.

కలెక్టర్‌ను కలిసిన మేయర్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఒ.ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో సోమవారం నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆమె మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీల స్వీకరణ

పొదలకూరు : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.శివకృష్ణ సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన రైతులు భూవివాదాలు, భూముల సర్వే, పాసు పుస్తకాల పంపిణీ తదితర సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

పొదలకూరు : స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌రిషిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని మరుగుదొడ్లు, వంటగది, పరిసరాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, అరుణ, వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి.. ఏదీ గతి..!

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఎందరినో ఆకర్షించేలా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో హామీలను గుప్పించింది. ఆ హామీల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారాన్ని చేపట్టి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతికి సంబంధించిన విధివిధానాలను ప్రకటించలేదు. దీంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందా.. లేదా.. అని నిరుద్యోగులు సందిగ్ధంలో ఉన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నారు.

– నెల్లూరు సిటీ/నెల్లూరు(మినీబైపాస్)





ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



గత కొన్నేళ్లుగా ఉద్యోగం కోసం వేచిచూస్తున్నాను. ఎంప్లాయిమెంట్ ఆఫీసులో కూడా దరఖాస్తు చేసుకున్నాను. మంచి ఉద్యోగం వస్తే కుటుంబాన్ని పోషించుకునే అవకాశం కలుగుతుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి కానీ, ఉపాధి కానీ కల్పిస్తామని కూటమి పార్టీ నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– ప్రసన్నకుమార్, నెల్లూరు

నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి



టీడీపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులు తమకు ఉద్యోగం వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎన్నికల హామీల్లో ప్రధానంగా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఉద్యోగం కల్పించకపోయినా నిరుద్యోగ భృతి అయినా ఇస్తామన్నారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి.

– సుగుణ్, నెల్లూరు

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని టీడీపీ కూటమి నేతలు ఎన్నికల హామీల్లో చెప్పారు. అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– ఎం.గోపాల్‌నారాయణ, బీఈ, హరనాథపురం

నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు



నేను ఎంబీఏ చదివాను. కొన్నేళ్లుగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుందని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి అందిస్తుందని కూటమి పార్టీల నేతలు ఎన్నికల హామీల్లో చెప్పారు. టీడీపీ కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– ఉదయ్‌కుమార్, డైకస్ రోడ్డు

హామీలను నెరవేర్చాలి



టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. తాము అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కూటమి నేతలు ఎన్నికల హామీల్లో చెప్పారు. ఉపాధి లేని వారికి నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేలా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– భాను, ఎంబీఏ, చింతారెడ్డిపాళెం

అర్జీలు పునరావృతం కాకుండా చూడండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను ప్రభుత్వం ఇచ్చిన గడువు లోపు పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించి సర్టిఫికెట్లు, రెవెన్యూ రికార్డుల మ్యుటేషన్స్, అర్జీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సరైన కారణం లేకుండా తిరస్కరించకూడదన్నారు. అర్జీల పరిష్కారం విషయంలో ఎండార్స్‌మెంట్ స్పష్టంగా ఇవ్వాలని, అర్జీలు మూడోసారి పునరావృతమైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ సక్రమంగా ఇవ్వకపోతే అదే సమస్యపై పదే పదే అర్జీలు ఇస్తారన్నారు. జిల్లాలో ప్రజారోగ్యంపై అధికారులు దృష్టి పెట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. మండలస్థాయిలో ఎంపీడీఓలు తాగునీటి పథకాలను శుభ్రం, క్లోరినేషన్ చేస్తున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు ప్రతి రోజూ రెండు గ్రామ పంచాయతీలు తనిఖీ చేయాలన్నారు. జిల్లాలో కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ కింద ప్రకటించడానికి 23 గ్రామాలకు సంబంధించి పబ్లిక్ హియరింగ్ ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరుగుతుందన్నారు. హాస్టల్, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న పిల్లలు జ్వరాలు, అనారోగ్యంతో బాధపడుతుంటే జాప్యం చేయకుండా వెంటనే డాక్టర్‌కు చూపించాలన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుందని, సంబంధిత జిల్లా, మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించండి



అర్జీదారుడి సమస్య వింటున్న అదనపు కమిషనర్ శర్మద

- నగరపాలక అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యలకు సంబంధించిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని నగరపాలక అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై మొత్తం 17 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగం – 5, టౌన్‌ప్లానింగ్ విభాగం – 4, హౌసింగ్ ఫర్ ఆల్‌కు – 3, ఆప్కాస్‌కు – 2, పబ్లిక్ హెల్త్ -1, పెన్షన్ విభాగానికి – 2 చొప్పున అర్జీలు అందాయని తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకూడదని, ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎస్.సంపత్‌కుమార్, మేనేజర్ ఇనాయతుల్లా, టీపీఓ దశయ్య, రెవెన్యూ అధికారులు శ్రీనివాసులు, సమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడిని కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న వెంకయ్యనాయుడు నివాసంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆయనను కలిసి పలు అంశాలపై చర్చించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(లీగల్): జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణకాంత్ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామినిని మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఆమె చాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు.

బిల్లు బాధ



రామ్మూర్తి నగర్‌లో బిల్లులు చెల్లించేందుకు క్యూలో ఉన్న వినియోగదారులు

గతంలో విదుయ్‌త్ బిల్లుల చెల్లింపు సులభతరంగా ఉండేది. వివిధ యాప్స్ ద్వారా వినియోగదారులు నగదును కట్టేవారు. ఇటీవల ప్రభుత్వం కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. అయితే దీనిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. దీంతో అనేకమంది విద్యుత్ బిల్లుల వసూల కేంద్రాల వద్దకు వెళ్లి నగదు చెల్లిస్తున్న పరిస్థితి ఉంది. క్యూలో నిలబడలేక వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

– నెల్లూరు

ఖాళీగా ఉంది కదా అని..



నెల్లూరు విజయమహల్ గేట్ రైల్వే ట్రాక్ వద్ద తాత్కాలిక మరమ్మతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గేట్లు మూసివేశారు. అక్కడ వాహనాలు నిలపకూడదని పోలీసులు బోర్డులు పెట్టినా వాహనదారులు పట్టించుకోలేదు. స్థలం ఖాళీగా ఉందని ఇష్టానుసారంగా కార్లను పార్కింగ్ చేస్తున్నారు.

– నెల్లూరు

విద్యాసామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): 'చక్రాల వారి ట్రస్ట్' వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమం. గీతామయి బాలల ఆశ్రమంలో సోమవారం అన్నదానం చేశారు. విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసినట్లు ఆ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, మేనేజర్ స్వామి సమయానంద తెలిపారు. కార్యక్రమంలో ఆదిశంకర ధ్యాన మందిరం అధ్యక్షుడు పారా గురు వేంకటశ్రీధర్‌శర్మ, అన్నవరం సత్యనారాయణ, జి.ప్రభాకర్‌శర్మ, ఒ.సుధాకర్‌శర్మ, ఆర్.మణిశంకర్‌శర్మ, ఎం.ఉదయ్‌కుమార్, చక్రాల లక్ష్మీరమణమూర్తి, వి.హరిప్రసాద్‌రావు, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

రొట్టెల పండగకు పకడ్బందీ ఏర్పాట్లు



రొట్టెల పండగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండగ ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దర్గా ప్రాంగణంలోని పోలీస్ కంట్రోల్ రూమ్, స్వర్ణాలచెరువు ఘాట్ పరిసరాలు, అన్నదాన కేంద్రాలు, వైద్యశిబిరాలు, రిసెప్షన్, మానిటరింగ్ సెంటర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ఈ నెల 17వ తేదీ నుంచి ఐదు రోజులు జరిగే రొట్టెల పండగకు ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. రొట్టెల పండగలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. వీరందరూ మంగళవారం నుంచి విధులకు హాజరవుతారని తెలిపారు. రెండు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడంతోపాటు దర్గాకు విచ్చేసే భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సుమారు 1,800 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు నియమించామన్నారు. బారికేడింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల్లో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. స్వర్ణాలచెరువు ఘాట్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను, బోట్లను గస్తీగా ఏర్పాటు చేశామన్నారు. అగ్నిమాపక సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీప్లానర్ దేవికుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మాన్యువల్‌గా ఇవ్వాలి



నెల్లూరు(దర్గామిట్ట): గిరిజనులకు మాన్యువల్ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా కమిటీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బీఎల్ శేఖర్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, ఇండ్ల రవి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మానికల నాగరాజు, బాధితులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణ సేవలపై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు డివిజన్, నెల్లూరు అర్బన్, కావలి డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు మాతా శిశు సంరక్షణ సేవలపై నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా.ఉమామహేశ్వరి, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణాధికారి డా. ఖాదర్‌వలీ, డిపిఎంఓ డా. రమేష్, డిపిహెచ్‌ఎన్‌ఓ మంజుల, తదితరులు, పాల్గొన్నారు.

నెల్లూరు పీఠాధిపతులే గంధ మహోత్సవం నిర్వహించాలి

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా రొట్టెల పండగలో భాగంగా పవిత్ర గంధ మహోత్సవాన్ని నెల్లూరు పీఠాధిపతులే నిర్వహించాలని, స్థానికేతరులతో నిర్వహించడం మత సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమని నెల్లూరు సాదాత్ మషాయఖ్ వెల్ఫేర్ ముస్లిం మత పీఠాధిపతుల సంఘం, పీఠాధిపతుల కమిటీ అధ్యక్షుడు కేఎస్ఎస్ బాబా బందనవాజ్ పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న గంధ మహోత్సవం నిర్వహణకు సంబంధించి సోమవారం నగరంలోని చిన్నబజార్‌లో ఉన్న ఖాజాపీర్ మఖాన్‌లో ముస్లిం మత పీఠాధిపతుల సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా బందనవాజ్ మాట్లాడుతూ పవిత్రమైన గంధ మహోత్సవాన్ని కొందరు వ్యక్తులు వారి ప్రయోజనాల కోసం రాజకీయం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సమావేశంలో పీఠాధిపతులు సయ్యద్ ఫయాజ్ రజ్వీసాహెబ్, సయ్యద్ జాహెద్‌సాహెబ్, సయ్యద్ సర్తాజ్‌సాహెబ్, సయ్యద్ రఫత్ హుసేనిసాహెబ్, సయ్యద్ సాలార్ హష్మీ, మౌలానా ఇస్తియాఖ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

'భక్తి-ప్రేమామృతం' ఆవిష్కరణ



కవి మైదవోలును సన్మానిస్తున్న పెరుగు రామకృష్ణ

నెల్లూరు(బృందావనం): సుప్రసిద్ధ ఆంగ్ల కవి మైదవోలు వెంకట శేషసత్యనారాయణ రచించిన 'భక్తి-ప్రేమామృతం' కవితా సంపుటిని నగరంలోని సరస్వతినగర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ ఆహ్వాన అతిథిగా విచ్చేసిన కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ సాహిత్యంలో ఆంగ్ల భాషలో విలక్షణ కవిగా మైదవోలు వెంకటశేషసత్యనారాయణ ఎంతో సుప్రసిద్ధులన్నారు. కార్యక్రమంలో వాసుదేవశర్మ పాల్గొన్నారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల కలిసి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రొట్టెల పండగకు వినూత్న స్వాగతం



ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం సోమవారం గాజు సీసాపై బారాషహీద్ దర్గా చిత్రాన్ని ఆక్రిలిక్ కలర్స్‌తో చిత్రీకరించారు. ఈనెల 17వ తేదీ నుంచి నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద రొట్టెల పండగ ప్రారంభమవుతున్న సందర్భంగా ఈ చిత్రం ద్వారా భక్తులకు స్వాగతం పలికారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

తోటపల్లిగూడూరు : ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని పోట్లపూడి దళిత కాలనీకి చెందిన కొమ్ము రమణయ్య(73) సోమవారం ఉదయం 7 గంటలకు గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. 8 గంటల సమయంలో పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ఫీల్డ్ అసిస్టెంట్, సహచర కూలీలు రమణయ్యను నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు.